సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023




రహదారులు జలమయం

కొయ్యూరు మండలంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. 8లో



దట్టంగా పొగమంచు

పాడేరు: రోజూ ఉదయం 9గంటల వరకు మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం వర్షం కురుస్తోంది.



ఇస్రో చూసొద్దామా.. 8లో

విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానంపై అవగాహన కల్పించి భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా ఇస్రో కృషి చేస్తోంది.

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:

ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
6-11	4-34

రంపచోడవరం :

ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
6-25	4-42

న్యూస్‌రీల్

సమస్యలుంటే సంప్రదించండి

చింతపల్లి అడిషనల్ ఎస్పీ ప్రశాంత్‌శివకిశోర్



గిరిజన యువకులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ ప్రశాంత్‌శివకిశోర్

సీలేరు: స్నేహపూర్వకంగా మెలగడమే కాకుండా ఏమైనా సమస్యలుంటే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని చింతపల్లి అడిషనల్ ఎస్పీ ప్రశాంత్‌శివకిశోర్ సూచించారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన యువతతో మాట్లాడారు. గంజాయి రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడుచుకోవాలని హితవు పలికారు. క్రీడల్లో రాణించడం ద్వారా మంచి భవిష్యత్తు పొందవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐలు రామకృష్ణ, అప్పలసూరి, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



పాడేరులో మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ మత బోధకులు, క్రైస్తవ కుటుంబాలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని క్రైస్తవ మతబోధకులు, క్రైస్తవ కుటుంబాలు పవిత్ర మట్టల ఆదివారం పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే అన్ని క్రైస్తవ మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జిల్లా కేంద్రమైన పాడేరులోని అన్ని ప్రార్థన మందిరాలలో క్రైస్తవ కుటుంబాలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రార్థనమందిరాల వద్ద సందడి నెలకొంది. పాడేరు పట్టణంలో యేసు క్రీస్తు ప్రార్థన మందిరం పాస్టర్ జి.తిమోతి ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులంతా మట్టలు పట్టుకుని పాడేరులో శాంతి ర్యాలీ నిర్వహించారు.

అనారోగ్యంతో శిశువు మృతి



చిన్నారి మృతదేహం

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లువ్వాపల్లి గ్రామంలో అనారోగ్యంతో 12 నెలల చిన్నారి మృతి చెందింది. గ్రామానికి చెందిన సెగ్గె చిన్నారావు, పార్వతమ్మ దంపతులకు చెందిన చిన్నారి శనివారం అర్ధరాత్రి శ్వాస అందక తీవ్ర అస్వస్థతకు గురైంది. కాసేపటికే మృతి చెందిందని తల్లిదండ్రులు తెలిపారు.

9నుంచి డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నీ

ఎటపాక: మండలంలోని కృష్ణవరం గ్రామంలో క్రిష్ణవరం యూత్ మెమోరియల్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 9 నుంచి చింతూరు డివిజన్ స్థాయిలో ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలతోపాటు షీల్డ్, సెమీస్‌కు చేరిన ప్రతి జట్టుకు రూ.2వేల నగదు ఇస్తామని తెలిపారు. ప్రతీ మ్యాచ్‌కు బాల్ ఉచితంగా ఇవ్వనున్నామని, తుది నిర్ణయం అంపైర్లదేనని కమిటీ తెలిపింది. వివరాలకు 6301832617,9652041992 నంబర్లలో సంప్రదించాలని కోరింది.

తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

వీఆర్‌పురం: శ్రీరామనమి వేడుకల్లో భాగంగా గోదావరి నదిలో సుందర సీతారామచంద్ర స్వామి వారికి నిర్వహించే తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు సామిత్రి పురుషోత్తమాచార్యులు, ఆలయ చైర్మన్ రేవు బాలరాజు ఆదివారం తెలిపారు. ఆలయానికి దక్షిణ దిక్కుగా ప్రవహించే పవిత్ర పుణ్య గోదావరి నదిలో సోమవారం తెల్లవారుజామున స్వామివారికి తెప్పోత్సవం, దొంగలదోపోత్సవం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

పోటాపోటీగా..

- కొనుగోలు చేస్తున్న జీసీసీ, ప్రైవేట్ వ్యాపారులు
- వారపు సంతల్లో పెరిగిన వ్యాపారం
- గిరి రైతులకు మంచి ఆదాయం



విక్రయానికి సిద్ధంగా పసుపు



మిరియాలు



హుకుంపేట వారపుసంతలో వ్యాపారులు భారీగా కొనుగోలు చేసిన వ్యవసాయ,వాణిజ్య ఉత్పత్తులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని వారపుసంతల్లో అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు గిరిజన సహకార సంస్థ, వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేయడం వల్ల గిరి రైతులకు మంచి ఆదాయం లభిస్తోంది. ప్రస్తుతం వారపు సంతల్లో కాఫీ,రాజ్‌మా గింజల అమ్మకాలు చివరి దశకు చేరుకున్నాయి. మిరియం, పసుపు, పిప్పలమోడి, చింతపండు అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. వారపు సంతల్లో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు.

ప్రతీ వారం రూ.కోటి వ్యాపారం

పాడేరు డివిజన్ పరిధిలో లోతుగెడ్డ, ధారకొండ, అన్నవరం, తాజంగి, జి.మాడుగుల, హుకుంపేట,గుత్తులపుట్టు, పెదబయలు, ముంచంగిపుట్టు, కించుమండ, అరకు, సుంకరమెట్ట, డముకు వారపు సంతల్లో ప్రతీ వారం సుమారు రూ.కోటి మేర వ్యాపారం జరుగుతోంది. మైదాన ప్రాంత వ్యాపారులు భారీగా కొనుగోలు చేసి తరలిస్తుంటారు. గిరిజన సహకార సంస్థ కూడా కొనుగోలు కేంద్రాలను సంతల్లో ఏర్పాటు చేసింది. కాఫీ గింజలు, రాజ్‌మా, పసుపు, అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తోంది. దీనివల్ల గిరి రైతులకు మార్కెటింగ్ సౌకర్యం మెరుగుపడింది.

హుకుంపేట సంతలో భారీ వ్యాపారం

- మండల కేంద్రం హుకుంపేటలో ప్రతీ శనివారం వారపు సంతలో లావాదేవీలు భారీ స్థాయిలో జరుగుతాయి. దీనిలో భాగంగా మిరియాలు, పసుపు, పిప్పలమోడి, చింతపండు వ్యాపారం పోటాపోటీగా కొనుగోలు చేశారు.
- వి.మాడుగుల, ఒడిశాకు చెందిన వ్యాపారులు కిలో రూ.460 ధరలో మిరియాలను కొనుగోలు చేశారు. పసుపు కిలో రూ.55 నుంచి రూ.60, పిప్పళ్లమోడి నాణ్యతను బట్టి కిలో రూ.270 నుంచి రూ.400 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు.
- చింతపండును కిలో రూ.35 నుంచి రూ.40కు కొనుగోలు చేశారు. సుమారు రూ.కోటి వరకు వ్యాపారం జరగడంతో గిరిజనులు మంచి ఆదాయం పొందారు.

జీసీసీ వల్లే ధరలు పెరుగుదల



మార్కెట్‌లో జీసీసీ పోటీలో ఉన్నందున ధరలు పెంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. జీసీసీ కిలో రూ.60 చొప్పున పసుపును కొనుగోలు చేసింది.జీసీసీ కొనకముందు దళారీ వ్యాపారులు కిలో రూ.50కు మించి కొనుగోలు చేసేవారు కాదు. చింతపండు,అటవీ ఉత్పత్తులను గిట్టుబాటు ధరతోనే జీసీసీ కొనుగోలు చేస్తున్నది. కాఫీ గింజలు పాచ్‌మెంట్‌ను కిలో రూ.285 చొప్పున కొనుగోలు చేస్తున్నాం.

– కురుసా పార్వతమ్మ, జీసీసీ డీఎం, పాడేరు

రేషన్ పంపిణీ ప్రారంభం

సమ్మె విరమించిన ఎండీయూ ఆపరేటర్లు



రేషన్‌కార్డుదారులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్

సాక్షి, పాడేరు: జిల్లాలోని 22 మండలాల్లో రేషన్‌కార్డుదారులకు ఇంటింటా బియ్యం, ఇతర నిత్యావసరాల పంపిణీ శనివారం ప్రారంభించారు. ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం నుంచి తగిన హామీ లభించడంతో శనివారం ఉదయం 10గంటల నుంచే గ్రామాల్లో వారు పంపిణీ మొదలుపెట్టారు. జిల్లాలోని 221 వాహనాల్లో రేషన్‌కు గ్రామాలకు తరలించి 2,93,646 మందికి పంపిణీ చేపట్టారు. ఉచిత బియ్యంతో పాటు సబ్సిడీ కందిపప్పు, పంచదార పంపిణీ త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని మండలస్థాయి అధికారులను ఆదేశించామని పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి శివప్రసాద్ తెలిపారు.

అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ముస్లిం సోదరులకు వడ్డిస్తున్న అయ్యప్ప భక్తులు

చింతూరు: స్థానిక అయ్యప్ప యూత్ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు ముస్లిం సోదరులకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసాలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు ఆదివారం రాత్రి వారు స్థానిక మసీదు- ఏ-యాసీన్‌లో ఇఫ్తార్ విందు ఇవ్వడం ద్వారా మత సామరస్యాన్ని చాటుకున్నారు.

గతంలో మాలధారణలో ఉన్న అయ్యప్ప స్వాములకు ముస్లిం యూత్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేసి సోదర భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప యూత్ సభ్యులు ఈశ్వరాచారి, మణి, హరి, అయ్యప్ప, గణేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తజనం





అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతరలో భాగంగా రెండో ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రి అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటకాలు చేసి అమ్మవారికి నివేదించారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ రద్దీతో నిండి ఆలయ రహదారిపై భక్తులు బారులు తీరారు. డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, ఆలయ ఈవో బండారు ప్రసాద్, పట్టణ సీఐ దాడి మోహనరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్రపర్వం కల్యాణోత్సవం

- తరలివచ్చిన భక్తజనం
- విశేషంగా ఎదురు సన్నాహోత్సవం
- ఘనంగా అప్పన్న రథోత్సవం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం



నృసింహ మండపంలో వేదికపై కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కనులపండువగా జరిగింది. అశేషంగా తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి పరవశించారు. స్వామి నామస్మరణలో మునిగితేలారు. కల్యాణోత్సవ కార్యక్రమాలను ఆలయ అర్చకులు మధ్యాహ్నం 3 గంటల నుంచి శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద పసుపుకొమ్ములను అర్చకులు, ముత్తయిదువులు దంచి కొట్నాల ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్ర పటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. తరువాత ఎదురుసన్నాహోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారు రంగు పల్లకీలోను, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలోను వేంజేపచేశారు. మాడవీధిలో జోడు భద్రాల వద్ద స్వామివారు, అమ్మవార్ల వైభవాన్ని, గొప్పతనాన్ని చాటిచెబుతూ ఎదురు సన్నాహోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూల దండలతో నృత్యాలు చేస్తూ ఎదురు సన్నాహోత్సవం రక్తికట్టించారు.



రథోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

హోరెత్తిన రథోత్సవం

కల్యాణోత్సవం వేడుకల్లో భాగంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం జాలరి పెద్ద కదిరి లక్ష్మణరావు రథసారథిగా నిలిచి రథ కదలికలను సూచిస్తుండగా, లక్ష్మీదేవి అమ్మవారి బంధువులుగా నగరం నలుమూలల నుంచి జాలర్లు.. రథం నడిపే బాధ్యతలు చేపట్టారు. అశేష భక్తజనసందోహం స్వామివారి రథాన్ని తాళ్లతో లాగి పరవశించారు. రథంలో ఉన్న స్వామివారిని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, సంపంగి శ్రీనివాసరావు, పంచాడి పద్మ, బయ్యవరపు రాధ తదితరులు దర్శించుకున్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం

నృసింహ మండపంలో రాత్రి 9.30 గంటల నుంచి స్వామివారి వార్షిక కల్యాణోత్సవం విశేషంగా జరిగింది. రథోత్సవం అనంతరం రథంలో ఉన్న స్వామివారిని, అమ్మవార్లను నృసింహమండపంలో కల్యాణ వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తరువాత భక్తులకు స్వామివారి ముత్యాల తలంబ్రాలను, ప్రసాదాన్ని అందజేశారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేశారు. డీసీపీ ఆనంద్‌రెడ్డి, ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, గోపాలపట్నం సీఐ సతీష్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రథోత్సవంలో ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఎపిడిమిక్ సీజన్‌లో వ్యాధుల నివారణ లక్ష్యం

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి ఆదేశం



పాడేరు జిల్లా ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న హెల్త్ డైరెక్టర్ రామిరెడ్డి



సికిల్‌సెల్ ఎనీమియా వైద్యవిభాగం వార్డును పరిశీలిస్తున్న రామిరెడ్డి

సాక్షి,పాడేరు: రానున్న ఎపిడిమిక్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా వ్యాధుల నివారణ లక్ష్యంగా వైద్యులు,సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ వి.రామిరెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో సికిల్‌సెల్, తలసీమియా, ఎనీమియా కేసుల నిర్ధారణ, ఉన్నత వైద్యసేవలు కల్పనకు సంబంధించి నూతనంగా నిర్మించిన బయోరేడ్ మిషన్, ల్యాబ్‌లను ఆయన పరిశీలించారు. విద్యార్థుల సిక్ వార్డులు, ఎన్‌ఆర్‌సీ విభాగం, అత్యవసర రోగుల వార్డు, సనరల్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు.ల్యాబ్‌లో పరీక్షకు ఉపయోగించే యంత్ర పరికరాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, రోజువారీ ఓపీ, ఇతర రికార్డులన్నింటిని ఆయన తనిఖీ చేశారు. సిక్ రూమ్‌లో వైద్యసేవలు పొందుతున్న గిరిజన విద్యార్థులతో మాట్లాడారు. వైద్యసేవలు, పౌష్టికాహారం పంపిణీపై వివరాలు తెలుసుకున్నారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శంకర్‌ప్రసాద్, ఇతర వైద్యులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ సికిల్‌సెల్, తలసీమియా కేసులకు సంబంధించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు వేగవంతం చేయడమే కాకుండా వారికి నిరంతరం మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. సంపూర్ణ పౌష్టికాహారంతో పాటు అవసరమైన రక్త నిల్వలు అందించాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని అన్ని వ్యాధుల నివారణకు సంబంధించిన పరీక్షలను కూడా సకాలంలో చేపట్టి ఆయా రోగులకు ఉన్నత వైద్యసేవలు కల్పించాలని రామిరెడ్డి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా మలేరియా అధికారి సాంబమూర్తి, వైద్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

సాక్షి, పాడేరు: స్థానిక తలారిసింగి ఆశ్రమపాఠశాల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో సాంకేతిక విద్యపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఏజెన్సీలోని 32 బాలికల ఆశ్రమ పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌ల ఇన్‌చార్జిలు, సహచర ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ ఫవర్, టగ్లిక్ సంస్థల ప్రతినిధులు దీపల్‌హోర, గణేష్, నీతిఆయోగ్ ప్రోగ్రాం డైరెక్టర్ దీపాలి ఉపాధ్యాయ, బేయర్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, పాఠశాల హెచ్‌ఎం రీమలి జాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డీఎస్‌వో నాగేశ్వరరావు, పాడేరు ల్యాబ్ ఇన్‌చార్జి రామారావు పాల్గొన్నారు.

కలెక్టర్ సారూ.. మా సమస్య పరిష్కరించండి

వినూత్నంగా బూరుగు, చినకోనేల గ్రామాల గిరిజనుల వినతి



మోకాళ్లపై నిల్చొని మాట్లాడుతున్న బూరుగు, చినకోనెల గిరిజనులు

అనంతగిరి: కలెక్టర్ సార్ మా గ్రామాల్లో పర్యటించి, మా సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని మారుమూల రొంపల్లి పంచాయతీ బూరుగు, చినకోనెల గ్రామాలకు గిరిజనులు ఆదివారం వినూత్నంగా విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నకోనెలలో సర్వే నెంబర్ ఒకటి నుంచి 6 వరకు 30 ఎకరాలు, బూరుగులో సర్వే నెంబర్ ఒకటి నుంచి 12 వరకు 90 ఎకరాలను సాగుచేసుకుని జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే రైతు భరోసా వంటి పథకాలు తమకు అందడం లేదన్నారు. రికార్డుల్లో పేర్లు లేనందున పథకం వర్తించడం లేదని వలంటీర్ చెప్పారని వారు పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

అడవుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



మాలిగూడాలో టేకు తోటలను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్

చింతపల్లి: ఏజెన్సీలో అడవుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అటవీశాఖ పీసీసీఎఫ్ అజయ్‌కుమార్ నాయక్ అన్నారు. గూడెంకొత్తవీధి మండలం ఆర్‌వీనగర్ రేంజి పరిధిలోని మాలిగూడాలో టేకు తోటలను ఆదివారం ఆయన పరిశీలించారు.చింతపల్లి డివిజన్ పరిధిలోని అటవీ సంపద పరిరక్షణలో భాగంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.టేకు ఇతర వృక్షాలు అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టేకు తోటల పర్యవేక్షణకు ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేశామని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి డీఎఫ్‌వో సూర్యానారాయణ,సబ్ డీఎఫ్‌వో బెర్‌నాండ్ రాజు, ఏఏఆర్వో వీరేంద్ర ఎఫ్‌బీవో ఈశ్వరరావు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

• విజయీభవ



జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 63 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 11,522 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీటిని పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు జిల్లా అధికారులు చేపట్టారు. పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఆశీర్వదించారు. 9లో

క్లుప్తంగా

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ ఉత్సవం



స్వామి వారికి పూజలు చేస్తున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, గ్రామస్తులు

సాక్షి,పాడేరు: మండలంలోని కరకపుట్టు గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయంలో మొదటి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం గిరిజనులు ఘనంగా జరిపారు. ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు దంపతులతో పాటు అనేక పార్టీల నేతలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు,గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, డి.గొందూరు, పాడేరు, డోకులూరు, లగిశపల్లి, వంజంగి పంచాయతీలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమరాధన కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు కూడా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు ధ్వజస్తంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రాలను, చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఏఈవో రమణమూర్తి అందజేశారు.

ఇస్రో చూసొద్దామా...

- తొమ్మిదో తరగతి విద్యార్థులూ చాన్స్ మిస్సవకండి
- యూవీకా 2023 రిజిస్ట్రేషన్లకు నేటితో ముగియనున్న గడువు
- ఎంపికైన విద్యార్థులకు రెండు వారాల ప్రత్యేక శిక్షణ
- అంతరిక్ష ప్రయోగాలు ఎలా చేస్తారో స్వయంగా తెలుసుకునే అవకాశం



ఇస్రో కేంద్రంలో ఉపగ్రహ ప్రయోగం

అనకాపల్లి రూరల్: ఈ విశ్వం నిగూఢ రహస్యాల అనంత నిధి. విశ్వం ఆవిర్భావం..జీవరాశి పుట్టుక..ఎందుకు..ఎలా..అన్న విషయాలు తెలుసుకోవాలన్న కుతూలహం అందిరికీ ఉంటుంది. ఈ విషయాలను ఛేదించేందుకు ప్రపంచంలోని అన్ని దేశాల శాస్త్రవేత్తలు నిరంతరం అంతరిక్ష పరిశోధనలు చేస్తూ ఉంటారు. వీటిని గురించి తెలుసుకోవాలనే ఆసక్తి విద్యార్థుల్లో ఎంతగానో ఉంటుంది. విద్యార్థి దశలోనే ప్రతిభ గల వారిని గుర్తించి వారికి అంతరిక్ష సాంకేతికత,పరిజ్ఞానం, అనువర్తనాలపై అవగాహన కల్పించి భావి శాస్త్రవేత్తలను తయారు చేయడమే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) కృషి చేస్తోంది. ఇందుకోసం యూవీకా-2023(యువ విజ్ఞాన కార్యక్రమం-2023) పేరుతో యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం చేపట్టింది. 2023-24 సంవత్సరంలో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులు ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఇస్రో అధికారిక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు ఏప్రిల్ 3 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా) కూడా ఇలాంటి కార్యక్రమమే నిర్వహిస్తోంది. ఇదే తరహాలోనే ఇస్రో దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు వివిధ అంతరిక్ష పరిశోధనా కేంద్రాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తోంది.అంతరిక్షంలో ఎలా ఉంటుంది, ఉపగ్రహాలు తయారీ,ఉపగ్రహ ప్రయోగాలు ఎలా చేస్తారు తదితర విషయాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. నిపుణులతో చర్చలు, సీనియర్ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు.ఈ స్ఫూర్తితో విద్యార్థులు సైన్స్ పట్ల ఆకర్షితులయ్యేందుకు,భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా చేయడమే యూవీకా లక్ష్యం.

దరఖాస్తు..ఎంపిక విధానం

ఇస్రో ప్రధాన వెబ్‌సైట్‌లో సొంత ఈ మెయిల్ ఐడీతో లాగిన్ అయి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 8వతరగతిలో పొందిన మార్కులకు 50 శాతం, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభకు 10 శాతం, సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభకు(జిల్లా/రాష్ట్ర/జాతీయ స్థాయి),క్రీడా పోటీల్లో ప్రతిభకు 2లేదా4లేదా5 శాతం,స్కాట్స్,గైడ్స్,ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ శిక్షణ పొందితే 5శాతం,గ్రామీణ ప్రాంతాల్లో చదువుతుంటే అదనంగా 15శాతం ఎంపికలో వెయిటేజీ ఇస్తారు.ఎంపికైన వారి మొదటి విడత జాబితా ఈ నెల 10న, రెండో విడత వడపోత తర్వాత జాబితా ఈ నెల20న ప్రకటిస్తారు. వీరంతా అవసరమైన ధ్రువీకరణపత్రాలను అప్‌లోడ్ చేయాలి. పరిశీలన అనంతరం తుది జాబితాను ఇస్రో అధికారులు ప్రకటిస్తారు. వీరంతా ఈ ఏడాది మే 14 లోగా సంబంధిత శిక్షణ కేంద్రాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. యూవీకా-2023 ప్రోగ్రాం ఈ ఏడాది మే15 నుంచి 26 వరకు రెండు వారాలు ఉంటుంది.దేశవ్యాప్తంగా 120 మందిని ఎంపిక చేస్తారు. ప్రతీ రాష్ట్రం,కేంద్ర పాలిత ప్రాంతం నుంచి ముగ్గురు ఉండేలా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.ఎంపికైన విద్యార్థులకు విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ (తిరువనంతపురం),యూ ఆర్ రావు శాటిలైట్ సెంటర్(బెంగళూరు), స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(అహ్మదాబాద్),నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(హైదరాబాద్), నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(షిల్లాంగ్)లలో రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఉంటుంది.విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సైతం కార్యక్రమంలో పాల్గొనడానికి అవకాశం కల్పించారు. శిక్షణ,ప్రయాణ,వసతి,భోజన ఖర్చులన్నింటినీ ఇస్రో భరిస్తుంది. శిక్షణ పూర్తయిన విద్యార్థులకు శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో రాకెట్ ప్రయోగాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తారు.

245 మంది నమోదు

జిల్లాలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 16,871 మంది ఉండగా ఇప్పటి వరకు 245 మంది నమోదు చేసుకున్నారు.



గతంలో యువికా ప్రోగ్రాంకు ఎంపికైన విద్యార్థులు

ముఖ్యమైన తేదీలు

రిజిస్ట్రేషన్ ప్రారంభ తేదీ	: మార్చి 20
నమోదుకు చివరి తేదీ	: ఏప్రిల్ 3
తొలి విడత జాబితా	: ఏప్రిల్ 10
రెండో విడత జాబితా	: ఏప్రిల్ 20
ఎంపికైన కేంద్రాల్లో రిపోర్టింగ్	: మే 14
యూవీకా శిక్షణ	: మే 15-26

చక్కటి అవకాశం



అంతరిక్ష రంగంపై ఆసక్తి కలిగించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది. జిల్లాలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలి.ఏ రంగంలోనైనా అవకాశాలను అందిపుచ్చుకునే వారినే విజయం వరిస్తుంది.చిన్న వయసులోనే శాస్త్ర, సాంకేతిక అంశాలు పరిచయమైతే భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుంది.ఇస్రో చైర్మన్‌తో సంభాషించే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ కుప్పల ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి,అనకాపల్లి

అహింసే ఆయుధం



అహింస రన్‌కు సిద్ధమవుతున్న నగరవాసులు

బీచ్‌రోడ్డు: అహింస అనేది మానవుడి ప్రాథమిక సూత్రమని చెబుతూ ఐఐఎఫ్ఎల్ జితో ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'అహింస రన్'ఉత్సాహంగా సాగింది. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వద్ద 3కే, 5కే, 10కే విభాగాల్లో 'అహింస రన్'నిర్వహించారు. నగరవాసులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అహింస మార్గాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు దేశంలోని 65 ప్రముఖ నగరాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా 23 దేశాల్లో రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 1.30లక్షల మంది పాల్గొన్నట్లు తెలిపారు.





చిన్నారితో ఉత్సాహంగా పరుగుపెడుతున్న తండ్రి, 10కె విజేతకు అభినందన

ఉత్సాహంగా బాడీలిఫ్టింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర బాడీ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం నక్కవానిపాలెంలోని వివేకానంద కల్యాణ మండపంలో జరిగాయి. సీనియర్స్‌కు ఏడు గ్రూపుల్లో, మాస్టర్స్‌కు మూడు గ్రూపుల్లో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు జ్ఞాపికలందించారు. 55 కేజీల వెయిట్ కేటగిరిలో సూర్యనారాయణ, హరికుమార్, యుగంధర్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. 60 కేజీల వెయిట్ కేటగిరిలో విష్ణువర్ధన్, ప్రసాద్‌రెడ్డి, హరిప్రసాద్, 65కేజీల వెయిట్ కేటగిరిలో గణేష్, సల్మాన్, నాగేంద్ర, 70 కేజీల వెయిట్ కేటగిరిలో దిలీప్, ఆకాష్, అనిల్‌కుమార్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. 75 కేజీల వెయిట్ కేటగిరిలో మణికంత, కుమార్‌రెడ్డి, అనుదీప్, 80కేజీల వెయిట్ కేటగిరిలో ఆనందరావు, వంశీ, భాస్కర్, 80+కేజీల వెయిట్ కేటగిరిలో చందు, ప్రణయ్, విద్యాసాగర్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. మాస్టర్స్ 40-45 ఏళ్ల వారిలో సీతారామ్, శ్రీనివాసరావు, వేంకటేశ్వరరెడ్డి, 45-50లో శ్రీరామచంద్రన్, గోవిందరావు, వెంకటరావు, 50+లో ఆనందరావు, సింహాచలం, మహేశ్వరరావు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు, 14వ వార్డు కార్పొరేటర్, పద్మారెడ్డి, బాడీలిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు శివశంకర్ పాల్గొన్నారు.



విజేతలకు జ్ఞాపికలందిస్తున్న కేకే రాజు

మహిళపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గొలుగొండ: పాకలపాడు గ్రామంలో భూ వివాదంలో మూకల సూర్యనారాయణమ్మపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై గొలుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామానికి చెందిన వెంకట రమణ అనే వ్యక్తికి మూకల సూర్యనారాయణమ్మ మధ్య భూ సమస్యలు ఉన్నాయి. శనివారం సాయంత్రం వెంకట రమణ సూర్యనారాయణమ్మపై దౌర్జన్యం చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆమె నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతోంది. శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నర్సీపట్నం: పాత సంతబయలకు చెందిన ఈశ్వరరావు(50) మద్యానికి బానిసై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని టౌన్ ఎస్ఐ గోవిందరావు తెలిపారు. ఆదివారం మద్యం సేవించి వచ్చి ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు.. గమనించి భార్య కేకలు వేయడంతో స్థానికులు వచ్చి తలుపులు కొట్టినా తియ్యకపోవడంతో, విరగ్గొట్టి తలుపు తీసేసరికి ఈశ్వరరావు చనిపోయి ఉన్నాడు.

ఇదీ నా దేశమే..

- ఈ నేలపై అడుగుపెట్టగానే తెలియని అనుభూతి కలుగుతుంది
- ఫ్రాన్స్ ఫుట్‌బాల్ ఆటగాడు వికాష్ రావు దొరసూ

విశాఖ స్పోర్ట్స్: ప్రపంచంలో అత్యధిక ఆదరణ ఉన్న క్రీడ ఫుట్‌బాల్. ప్రతి ఫుట్‌బాల్ ఆటగాడు ఫిఫా ప్రపంచ కప్‌లో ఆడేందుకు ఉవ్విళ్లూరుతుంటాడు. కానీ 32 దేశాల జట్లు మాత్రమే అర్హత సాధిస్తాయి. భారత్‌కు అది ఇప్పటికీ ఓ కలే. కానీ భారత సంతతికి చెందిన ఓ ఆటగాడు ఏకంగా ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో ఆడాడు. అతనే వికాష్ రావు దొరసూ. పూర్వీకులు ఇక్కడి వారే అయినా మారిషస్ వెళ్లిపోయి స్థిరపడిపోయారు. వికాష్ ఫ్రాన్స్ దేశంలోని హర్‌ఫ్లెర్‌లో జన్మించారు. విశాఖలో జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ ఫైనల్ చూసేందుకు వికాష్ వచ్చారు. ఇక్కడ అడుగుపెట్టగానే ఏదో తెలియని అనుభూతి కలుగుతోందని 'సాక్షి'తో తన అనుభవాలను పంచుకున్నాడు.

కీలకమైన పొజిషన్‌లో..

నేను ఐదు అడుగుల ఆరు అంగుళాలు ఉంటాను. సెంట్రల్ మిడ్‌ఫీల్డర్‌ను. మిడ్‌ఫీల్డర్‌ను కనుక బంతిని అటాకర్స్‌కు అందించడంలోనే నా పాత్ర ఉంటుంది. ఇది ఆటలో కీలకమైన పొజిషన్. చాలా వేగంగా బంతిని డ్రిబిల్ చేస్తూనే ప్రత్యర్థికి అందకుండా జట్టు ఆటగాడికి అందించాలి. కెరీర్‌లో దాదాపు 375 మ్యాచ్‌లు ఆడాను. 16 గోల్స్ చేశాను.

ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్‌గా..

1993 నుంచి 2007 వరకు ప్రొఫెషనల్ ఫుట్‌బాలర్‌గా ఆటతోనే ఉన్నాను. 50 ఏళ్లు రావడంతో ఇప్పుడు ఆటను ఎంజాయ్ చేస్తున్నా. అంతర్జాతీయ ఆటగాడిగా ఫ్రాన్స్ తరఫున 1999 నుంచి 2006 వరకు ఆడాను. 2006లో ఫ్రాన్స్ జట్టు ఫిఫా ప్రపంచ ఫుట్‌బాల్ కప్ ఫైనల్స్‌కు చేరింది. రన్నరప్‌గా నిలిచిన జట్టులో నేనూ ఓ సభ్యుడిని అయినందుకు గర్వంగా ఉంది.

18 క్యాప్‌లు అందుకున్నా..

అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు ప్రతీ మ్యాచ్‌కు ఓ క్యాప్ ఇస్తారు. క్రీడాకారుడికి అది గౌరవ సూచకం. అలా నేను ఫ్రాన్స్ తరఫున 18 మ్యాచ్‌లాడి 18 క్యాప్‌లను అందుకున్నాను. నేను మిడ్‌ఫీల్డర్ అయినా అనూహ్యంగా ప్రపంచకప్‌లో ఓ గోల్ చేశాను.

వేరే దేశ క్లబ్‌కు..

2004లో ఇటాలియన్ క్లబ్ ఏపీ మిలానోకు రెండేళ్ల కాంట్రాక్ట్‌తో ఆడటం మొదలెట్టాను. ప్రత్యామ్నాయ ఆటగాడిగా కూడా జట్టుకు సేవలందించాను. అదే క్రమంలో యూఈఎఫ్ఏ చాంపియన్స్‌లీగ్ ఫైనల్‌కు చేరుకున్నాం. అయితే టైటిల్ పోరులో లివర్‌పూల్ జట్టు పెనాల్టీలో మాపై ఆధిక్యం సాధించింది. అక్కడే నాకు ఫ్రాన్స్ జట్టు తరఫున ప్రపంచకప్ ఆడే జట్టుకు అర్హత లభించింది. 2006 ఫిఫా వరల్డ్‌కప్ క్వాలిఫై మ్యాచ్‌లో సైప్రస్‌పై మూడు గోల్స్ చేయగా జట్టు 4-0తో గెలిచింది.

1993లో కెరీర్ ప్రారంభం

1993 ఆగస్టులో సెయింట్ ఎటిన్నీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో లే హవ్రే క్లబ్‌తో నా కెరీర్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలా ఐదేళ్ల పాటు అదే జట్టుతో కొనసాగాను. 1998లో ఒలింపిక్ లియోనైస్‌కు ఆడటం మొదలెట్టాను. లీగ్ రైవల్స్ అయిన గిరోండిన్స్ జట్టుతో 2001, 2002లో తలపడటం, 2003, 2004లో ఫ్రెంచ్ లీగ్ చాంపియన్‌షిప్ సొంతం చేసుకునే స్థాయికి చేరింది.



ఆ గోల్ మరిచిపోలేనిది

కూపే డి ఫ్రాన్స్ చాంపియన్‌షిప్‌లో 25 యార్డ్‌ల దూరం నుంచే గోల్ చేయడం నా జీవితంలో మరిచిపోలేని సంఘటన. అదీ మనకు దాయాది పాకిస్తాన్‌లా రైవల్రీ జట్టు మార్సెల్లీపైనే జరిగింది. 2006లో జట్టు మేనేజర్ లకొంబేపై వ్యాఖ్యతో పీఎస్‌జీ కాంట్రాక్ట్‌ను రద్దు చేసింది. ఓ ఫ్రెంచి ప్రొఫెషనల్ ఆటగాడిని ఈ విధంగా తొలగించడం అదే తొలిసారి. 2007లో లివార్నొకు కాంట్రాక్ట్ కుదిరినా ఆడకుండానే వైదొలిగాను.

ఫిట్‌నెస్ కాపాడుకోవాలి

గతంలోనూ ఇక్కడకు వచ్చాను. ఈ నేల తాకగానే ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. పేదరిక నిర్మూలన లాంటి కార్యక్రమాల్లో పాల్గొంటుంటాను. ఫుట్‌బాల్ అనేది చాలా స్టామినా, పవర్, స్ట్రెంగ్త్‌తో కూడుకున్న ఆట. ఆటగాళ్లు ఎప్పుడూ ఫిట్‌నెస్‌గా ఉండాలి. పుట్టింది ఇక్కడ కాకపోయినా.. ఇక్కడ అడుగుపెట్టగానే ఇదీ నా దేశమే అనే ఫీలింగ్ కలుగుతుంది. ఇక్కడకు రాగానే ఎంతో ఉత్సాహంగా ఉంటుందని వికాష్ ముగించారు.

రహదారులు జలమయం

కొయ్యూరు: మండలంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మండల కేంద్రంలో సంతకు వచ్చిన వ్యాపారులు, గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. సుమారు 45 నిమిషాలపాటు భారీ వర్షం కురిసింది. కాసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దిగుబడి దశలో ఉన్న జీడిమామిడికి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు నష్టం చేకూరుస్తున్నాయని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల వల్ల పశువులకు పచ్చిమేత సమస్య పరిష్కారమైందని గిరి రైతులు తెలిపారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండల వ్యాప్తంగా ఆదివారం సాయంకాలం భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. ఈదురు గాలులు వీచడం వల్ల మామిడి, జీడి మామిడి పంటలకు స్వల్ప నష్టం కలిగింది. మండలం మీదుగా ఎన్‌హెచ్ 516 ఈ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. తంటికొండ సమీపంలో ఆర్టీసీ బస్ బురదలో కూరుకుపోయింది. రోడ్డు నిర్మాణ కార్మికులు, స్థానికులు అతి ప్రయాసతో దానిని బయటకు తీశారు.



తంటికొండ వద్ద బురదలో కూరుకుపోయిన బస్సు

ఏటికొప్పాక బొమ్మలకు డీఐజీ ఫిదా

యలమంచిలి: అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన ఏటికొప్పాక లక్కబొమ్మలను చూసిన డీఐజీ హరికృష్ణ ఫిదా అయ్యారు. శనివారం రాత్రి సతీసమేతంగా ఆయన ఏటికొప్పాకను సందర్శించారు.హస్తకళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటున్న లక్కబొమ్మలను పరిశీలించారు.సహజ సిద్ధమైన రంగులతో వివిధ రకాల బొమ్మలను తయారుచేస్తున్న కళాకారులను ఆయన ప్రశంసించారు. డీఐజీని హస్తకళాకారులు, వైఎస్సార్‌సీపీ నేతలు సన్మానించారు. డీఐజీ వెంట అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి, సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ కె.సన్నిబాబు తదితరులున్నారు.

డిజిటల్ అక్షరాస్యత తప్పనిసరి



కోర్సు పూర్తి చేసిన విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీఎస్‌సీ ఈ గవర్నెన్స్ జిల్లా మేనేజర్ సంతోష్ కుమార్



డిజిటల్ లిటరసీ సర్టిఫికెట్లతో విద్యార్థులు

అనకాపల్లి రూరల్: ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరైనా డిజిటల్ అక్షరాస్యులుగా ఉండాలని సీఎస్‌సీ ఈ గవర్నెన్స్ జిల్లా మేనేజర్ సంతోష్ కుమార్ అభిప్రాయపడ్డారు. ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబంలో ఒకరిని డిజిటల్ అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆదివారం మండలంలోని తుమ్మపాల కామన్ సర్వీస్ సెంటర్‌లో శిక్షణ పొంది, డిజిటల్ అక్షరాస్యత కంప్యూటర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అక్షరాస్యత తప్పనిసరి అని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. డిజిటల్ అక్షరాస్యతకు అధిక ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాలలో ఒకటైన ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,దారిద్ర్య రేఖకు దిగువన కుటుంబాలు, దివ్యాంగులకు సుమారు 20 గంటల డిజిటల్ శిక్షణ ఉచితంగా అందిస్తున్నట్టు ఆయన చెప్పారు.ట్యాబ్లెట్లు,కంప్యూటర్లు,స్మార్ట్‌ఫోన్‌లను ఎలా ఉపయోగించాలో శిక్షణలో నేర్పుతారు. తుమ్మపాలలో ఇప్పటివరకు 130 మంది ఈ కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకోగా,70 మంది పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని వారందరికీ ఉచితంగా ధృవీకరణ పత్రాలు అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు.జిల్లా సమన్వయకర్త కె శివ,కామన్ సర్వీస్ సెంటర్ వీఎల్ఈ వి.వెంకట్ రాము,గణేష్ కోచింగ్ సెంటర్ మాస్టర్ బొడ్డేడ జోగినాయుడు,వలంటీరు అప్పికొండ శ్రావణి పాల్గొన్నారు.